క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మండల అధ్యక్షుడు గొల్ల కేశన్న అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలున్నట్లు అధికారుల దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు గుడేకల్ పాలయ్య, ఎంపీడీఓ బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

పెద్దకడబూరు: భూమి ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని రైతుసంఘం డివిజన్ కార్యదర్శి ముబ్బు ఆంజనేయ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో ఏపీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వం లానే ఎలాంటి షరతులు లేకుండా ఇనాం భూములు, ల్యాంగ్ సీలింగ్, అసైన్డ్, ఏడబ్ల్యూ, అన్ని ప్రభుత్వ భూములు కలిగిన రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి


నాగరాజు (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుబలం వీఆర్ఏగా పనిచేస్తున్న టి.నాగరాజు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్ రెవెన్యూ అధికారుల ద్వారా బాధితా కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులకై రూ.25 వేలు అందజేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ బాబు, ఆర్ఐ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

అర్హులు అప్పీలు చేసుకోండి

పెద్దకడబూరు : అర్హులైన వికలాంగులు పింఛన్ల కోసం తిరిగి అప్పీలు చేసుకోవచ్చని ఎంపీడీఓ ప్రభావతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో వికలాంగుల పింఛన్లు మొత్తం 971 ఉండేవన్నారు. రీ వెరిఫికేషన్‌లో భాగంగా 156పింఛన్లు తొలగిపోయాయన్నారు. వారిలో అర్హులు ఎవరైనా ఉంటే తిరిగి అప్పీలు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అప్పీలు చేసుకున్నవారి కోసం మరోసారి సదరం క్యాంప్ ద్వారా రీ వెరిఫికేషన్ చేసి అర్హులకు తిరిగి పింఛన్ అందజేయడం జరుగుతుందిని వివరించారు.

నాటుసారా స్థావరంపై దాడులు

ఆదోని రూరల్: ఆదోనిలోని ఆఫిసారాళ్ల కొండల్లో బుధవారం నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్, ఆదోని సివిల్ పోలీసులతో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో 350 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. ఆదోనిలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ హనుమన్నపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నులి పురుగులను నివారిద్దాం

ఆదోని సెంట్రల్: నులి పురుగులను నివారిద్దామని మండిగిరి హెల్త్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్వేత పిలుపునిచ్చారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన బుధవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా వర్కర్లు నాగవేణి, లత, భారతి, శాంతి కళాశాల ఇన్‌చార్జ్ మధు, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ వీక్లిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మినీవ్యాన్ బోల్తా.. కన్నడ భక్తులకు గాయాలు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో మినీవ్యాన్ బోల్తా పడి కర్ణాటక భక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుధవారం తెల్లవారుజామున బెంగళూరు నగరంలోని తుమ్ముకూర్ చెందిన 15 మంది భక్తులు రాఘవేంద్రస్వామి దర్శనార్థంకై వస్తుడంగా మంత్రాలయం సమీపంలోని కల్లుదేవకుంట గ్రామం వద్ద మినీవ్యాన్ స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో క్రాసింగ్‌లో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన లక్ష్మీదేవమ్మ, కోకిలను 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

మంత్రాలయం రూరల్ : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలు అయిన సంఘటన మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎమ్మిగనూరు మండలం దేవబెట్ట గ్రామానికి చెందిన గొల్ల ఈరన్న, మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన నరసింహులు మండల పరిధిలోని మాధవరం గ్రామం నుంచి రచ్చుమర్రి గ్రామం వైపు పల్సర్ బైకుపై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతను గమనించక పోవడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వెంటనే 108లో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇంట్లో ఇద్దరు దివ్యాంగులు


లక్ష్మీ,నరసప్ప దంపతులు

జంపాపురం గ్రామానికి చెందిన నరసప్ప, లక్ష్మి దంపతులు. వీరిద్దరికి కాళ్లు సరిగ్గా లేవు. భార్య లక్ష్మికి 20 ఏళ్లుగా వికలాంగ పింఛన్ వస్తోంది. ఈ పింఛన్ సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నారు. అయితే, ఇటీవల సదరంలో వికలాంగత్వం తక్కువ ఉందని నోటీసులు అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న పింఛన్‌ను ఇప్పుడు ఏవో కారణాలు చెప్పి తొలగిస్తే ఎలా బతకాలని వాపోతున్నారు. తమ ఇద్దరికి పనులు చేసుకునేందుకు శరీరం సహకరించదని, ఈ విషయంలో సర్కారు పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

మతిస్థిమితం లేని మహిళకు నోటీసులు


తోడుగా పట్టుకుని వెళ్తున్న తిక్కమ్మ

కోసిగికి చెందిన తిక్కమ్మకు పుట్టుకతోనే ఆరోగ్యం బాగాలేదు. చిన్నప్పటి నుంచి మతిస్థితమితం లేకపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తుంది. సోదరుడి ఇంట్లో తలదాచుకుంటోంది. తోడు లేనిదే ఈమె అడుగు కూడా బయట పెట్టలేదు. అలాంటి మహిళకు పర్సంటేజ్ తక్కువ ఉందని పింఛన్ తొలగించారు. ఏం చేయాలో తెలియక ఆ నోటీసు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.

పుట్టుకతోనే చెవిటి, మూగ



గోనెగండ్ల మండలం పెద్దనేలటూర్‌కు చెందిన ఈశ్వరప్ప పుట్టుకతోనే మూగ, చెవిటి. ఇతనికి చిన్నప్పటి నుంచే పింఛన్ వస్తుంది. ఈయన భార్య శశికళ, కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు ధరణిధర్ కూడా మానసిక వికలాంగుడు. అయితే ఇతనికి గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లో 99 శాతం వైకల్యం ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేసి 28 శాతం మాత్రమే వైకల్యం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. 40 శాతం కంటే తక్కువ ఉందని పింఛన్ తొలగించారు. తన బాధ ఎవరికీ చెప్పుకోలేక మూగగా రోదిస్తున్నాడు.

అన్యాయంపై ఆగ్రహం

- పింఛన్ల తొలగింపుపై ఆందోళన బాటలో దివ్యాంగులు
- కార్యాలయాల ఎదుట ధర్నాలు
- కూటమి సర్కారు తీరుపై మండిపాటు


గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు


కౌతాళం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన వికలాంగులు


మంత్రాలయం ఎంపీడీఓ నూర్జహాన్‌కు రీ వెరిఫికేషన్ పత్రాలను అందజేస్తున్న దివ్యాంగులు

కౌతాళం: కూటమి సర్కారు కక్ష సాధింపునకు అనర్థమంటూ ఏదీ లేదు. అర్హత పేరుతో దివ్యాంగుల ఆసరాకు ఎసరు పెట్టింది. పింఛన్ల కోతలో భాగంగా వేలాది మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించింది. కారణంగా దివ్యాంగులు ఆందోళన బాట పట్టారు. ఆయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నాకు దిగారు. కౌతాళం మండలంలో మొత్తం 129 ఫించన్లు తొలగించడం జరిగింది. మండల కేంద్రంలో 25 మందికిపైగా కోత వేశారు. దీంతో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు సదరం సర్టిఫికెట్లు ఉన్నా.. 70 శాతం మించి అంగవైకల్యం ఉన్నా ఫించన్లు తొలగించడం సరికాదని దివ్యాంగులు వాపోయారు. డాక్టర్ల సర్టిఫికెట్‌నే ప్రభుత్వం తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమపై కరుణ చూపాలని వేడుకున్నారు. ఆందోళనకు ఏపీ రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. పింఛన్లను తొలగించడంతో చాల మంది వికలాంగులకు ఆసరా కొల్పోయారని మండల కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్ అన్నారు.

నందవరంలో 167 దివ్యాంగుల పింఛన్లు కట్

నందవరం : మండలంలో దివ్యాంగుల పింఛన్లు 167 తొలగించేందుకు కూటమి ప్రభుత్వం వికలాంగులకు నోటీసులు జారీ చేసింది. నందవరం-34, నాగలదిన్నె-8, కనకవీడు, కే.పేట-24, ముగతి-17, గురజాల-17, మాచాపురం-7, పెద్దకొత్తిలి-11, సోమలగూడూరు-22, హాలహర్వి-4, ఇబ్రహీంపురం-6 దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పింఛన్ల తొలగింపు ప్రక్రియ మొదలు పెట్టడడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అందిస్తున్న పింఛన్లు అకారణంగా ఎందుకు తొలగిచారో అర్థం కాక, ఏమి చేయాలో తెలియక మాకు న్యాయం చేయండంటూ ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి అధికారులను వేడుకుంటున్నారు.

ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన

గోనెగండ్ల : తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని దివ్యాంగులు, వీహెచ్‌పీఎస్ సంఘం నాయకులతో కలిసి బుధవారం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోమన్న, మహిళ అధ్యక్షురాలు నాగశేషమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్స్‌లో పర్సంటేజ్ తక్కవ చూపి దివ్యాంగులకు పింఛన్లను తొలగిస్తోందని మండిపడ్డారు. అనర్హుల పింఛన్లు తొలగిస్తామని చెప్పి.. నిజంగా అర్హుల పింఛన్ల తొలగించడం ఎంటాని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనంతసేనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ సంఘం నాయకులు సుంకన్న, మునిస్వామి, మాబుభాష, మునెప్ప, దివ్యాంగులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి..మేడమ్

మంత్రాలయం రూరల్: రీ వెరిఫికేషన్‌లో దివ్యాంగుల పింఛన్లు తొలగించుకుండా తమ న్యాయం చేయండి.. మేడమ్ అంటూ వికలాంగులు ఎంపీడీఓ నూర్జహాన్‌ను వేడుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వికలాంగులు రీ వెరిఫికేషన్ పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. పింఛన్లు తొలగిస్తే జీవనాధారం కోల్పోతామని, కొంత మంది ఈ పింఛన్లపై ఆధానపడి జీవిస్తున్నారని వివరించారు. దివ్యాంగులు బోయ రామలింగమ్మ, బోయ విరుపాక్షమ్మ, బోయ జయమ్మ పాల్గొన్నారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మంచిది కాదు

ఆదోని అర్బన్: నోరు ఉందని, పార్టీ అండ ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మంచి పద్ధతి కాదు, ప్రజల మనోభావాలు దెబ్బతింటాయి.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని.. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బీజేపీ కార్యకర్తలపై మండి పడ్డారు. ఈనెల 17వ తేదీన స్థానిక హనుమాన్ నగర్‌లో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ధర్మకర్త, ఆధ్యాత్మిక గురువు రాజరాజేశ్వరి అమ్మవారు అనారోగ్యంతో తెల్లవారుజామున మృతిచెందిన విషయం పాఠకులకు విధితమే. అయితే మరుసటి రోజు నుంచి బీజేపీ కార్యకర్తలు రూ.వంద కోట్ల ఆలయ ఆస్తిని వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్య నాయకులు కాజేశారని ఆరోపిస్తూ సబ్‌కలెక్టర్, డీఎస్పీకి వినతి పత్రం అందజేసి ఆందోళన చేశారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బుధవారం స్థానిక హనుమాన్‌నగర్‌లో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో టీడీపీ, కాంగ్రెస్, విశ్వహిందూ పరిషత్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.వంద కోట్లు ఉందని బీజేపీ నాయకుల ఆరోపణలు అవాస్తవమన్నారు. ఇదేమైనా మంత్రాలయం, ఉరుకుంద, శ్రీశైలం ఆలయాలా?.. ఇంత ఆస్తులు రావడానికి అని ఎద్దేవా చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి నిందలు వేయడం వల్ల భక్తితో ఆలయాల అభివృద్ధి చేసే వారు తమపై కూడా ఇలాంటి నిందలు వస్తాయని భావించి ముందుకు రారన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా నాయకులు బసవన్నగౌడ్, విట్టా రమేష్, ఎగ్గటి ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, దిలీప్‌దోకా, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషిరెడ్డి, టీడీపీ నాయకులు జిందే శంకర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్ఠించిన శ్రీరామ విగ్రహం

పెద్దకడబూరు: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు శ్రీమాన్ రామమూర్తిస్వా మి, శ్రీమాన్ సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళ శాసనములతో తెల్లవారుజాము నుంచి రా మాలయ జీర్ణోద్ధరణ, కుంభాభిషేకం మహోత్సవాన్ని చేపట్టారు. అనంతరం పుణ్యావాచన, రక్షాధరణ, మృతసంగ్రహణం, అంకురార్పణ శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ గావించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కున్నూరులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గోనెగండ్ల : మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కున్నూరు, కోటకొండ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఐదో రోజు బుధవారం శ్రీకృష్ణ జన్మదినం వేడుకలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు.

రసాయన ఎరువుల సీజ్


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

మంత్రాలయం : మండలంలోని మాధవరం గ్రామంలోని శ్రీ బాలాజీ ఎరువుల దుకాణంలో ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. దుకాణంలోని రికార్డులు పరిశీలించి ఎరువుల నిల్వను పరిశీలించారు. అందులో అక్రమంగా నిల్వ ఉంచి ఎరువుల బస్తాలు బయటపడ్డాయి. దుకాణంలో 200 బస్తాల ఫ్యాక్ట్, 25 బస్తాలు 10.26.26 రకం, 165 బస్తాల 15:15:15 రకం, 30 బస్తాల ఎంవోపీ ఎరువులను గుర్తించారు. సదరు ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఏఈవో తిరుమలరెడ్డి, వీఏఏలు రాజేష్, విజయ్, సురేంద్ర ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

గోనెగండ్ల: ఎరువుల దుకాణదారులు యూరియా కొరతను సృష్టించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ హేమలత, డిప్యూటీ తహసీల్దార్ రాఘువీర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని కిసాన్ మాల్, మన గ్రోమోర్ తదితర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కృత్రిమంగా కొరత సృష్టిస్తున్నారని అలాంటి వారి లైసెన్స్ రద్దుచేస్తామని హెచ్చరించారు.

మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నందవరం : ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు ఎరువుల దుకాణాదారులను హెచ్చరించారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్లను మండల వ్యవసాయ అధికారిణి సరిత ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మిగనూరుటౌన్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని పద్మశ్రీ మాచాని సోమప్ప ట్రస్ట్ నిర్వాహకులు మాచాని సోమనాథ్, పట్టణ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో పద్మశ్రీ మాచాని సోమప్ప పేరుపై బుధవారం చాలెంజర్స్ క్రికెట్ క్లబ్ ఫర్ ద డిజేబుల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని టోర్నీనీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్ వైజర్లు సుచరిత, భాగ్యలక్ష్మిలకు సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, యునియన్ నాయకులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శైలజ, నాగలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

బాలికల పాఠశాల సమీపంలో వైన్‌షాపు వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ బాలికల హైస్కూల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వైన్‌షాపు ఏర్పాటు చేయవద్దని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల, కళాశాలకు వచ్చి వెళ్లే ప్రధాన రహదారి వద్ద వైన్‌షాపు ఏర్పాటు చేయడం వల్ల మందుబాబుల ఆగడాలతో విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విద్యార్థినులకు రక్షణ కల్పించాల్సిన అధికారులు వైన్‌షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు నరసింహారెడ్డి, పుల్లయ్య, ఉమేష్‌నాయుడు, కార్తీక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి నీళ్ల ట్యాంకర్ విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులకు తాగునీరు సరఫరా కోసం తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణ వాస్తవ్యులు మంత్రాలయం కిరాణం జనరల్ స్టోర్ వారు నీళ్ల ట్యాంకర్‌ను అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి కోరారు.

పింఛన్లు యథావిధిగా కొనసాగించాలి


మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్

ఆదోని టౌన్: కొందరు వికలాంగులకు ఇటీవల పింఛన్‌లు నిలిపివేస్తూ కన్వర్షన్ నోటీసులు జారీ చేశారని, వెంటనే నోటీసులు ఉపసంహరించుకొని పింఛన్లు యథావిధిగా కొనసాగించేలా చూడాలని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణను కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 498 మందికి నోటీసులు జారీ చేయగా నిజాముద్దీన్ కాలనీ పరిధిలో 10 మంది ఉన్నారన్నారు. పింఛన్‌దారులందరూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారన్నారు. ముఖ్యంగా స్వయంగా జీవనాధారం సంపాదించే స్థితిలో లేరని, పూర్తిగా ప్రభుత్వం అందించే పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

గోనెగండ్ల: మన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ తిమ్మక్క సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో బస్టాండ్ ప్రాంతం, లక్ష్మీపేట కాలనీలో పరిశుద్ధ్య పనులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనంతసేనతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలేవరూ చెత్తను బయట పారవేయకూండా తడి, పొడి చెత్తలను వేరువేసి డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు వారికి అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమవతి, చంద్రశేఖర్, సిబ్బంది మలాంగ్, హరి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ఎంఎన్. భార్గవి

ఎమ్మిగనూరురూరల్: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ ఎంఎన్ భార్గవి అన్నారు. బుధవారం తెల్లవారుజామున పట్టణంలోని శక్తినగర్, క్రాంతి నగర్, ఎరుకుల వీధి, లక్ష్మీపేట, తిలక్ నగర్, ఎంఎస్ నగర్, వెంకటాపురం కాలనీ, ఎస్సీ కాలనీల్లో డీఎస్పీ ఎంఎన్ భార్గవి ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా విడిపోయి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా కాలనీలో అన్ని ఇళ్లలో సోదాలు నిర్వహించి రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని, రౌడీషీటర్స్, ఇతర కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కదలికపై నిఘా ఉంచుతామన్నారు. దొమ్మీలు, దౌర్జన్యాలకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో సీఐలు వి. శ్రీనివాసులు, మధుసూదన్‌రావు, రామాంజులు, మంజునాథ్, భాస్కర్, అశోక్, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, కేశవ్, నిరంజన్‌రెడ్డి, విజయకుమార్, శివాంజిల్, ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.